క్లుప్తంగా

పుణ్యక్షేత్రంలో వైద్య శిబిరం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ లక్ష్మీమృదుల

రాజానగరం: పుణ్యక్షేత్రంలో రాజమహేంద్రవరం వేద స్పైన్ సెంటర్ గైనకాలజిస్టు డాక్టర్ లక్ష్మీమృదుల ఆధ్వర్యంలో గురువారం స్త్రీల వ్యాధులకు సంబంధించి వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచ్ మరుకుర్తి వెంకటేశ్వరరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. మహిళలు రక్తహీనత లేకుండా ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నెలసరి సమయంలో అధికంగా రక్తస్రావం జరిగితే వెంటనే గైనకాలజిస్టును సంప్రదించాలన్నారు. కణితలు, గడ్డలు ఉంటే వాటిని కూడా నిర్లక్ష్యం చేయరాదన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరం నిర్వహణకు బీజేపీ మండల అధ్యక్షుడు పేపకాయల కాశీ సహకారం అందించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ వీరయ్య గౌడ్

రాజానగరం: వర్గవైషమ్యాలు, వ్యక్తిగత ద్వేషాలతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవచ్చని సీఐ ఎస్పీ వీరయ్య గౌడ్ అన్నారు. నరేంద్రపురం ఉప్పర్ల కాలనీలో ప్రజలకు గురువారం ఈ మేరకు అవగాహన కల్పించారు. గ్రామంలోని ఇరువర్గాలపై కేసులు నమోదైన నేపథ్యంలో శాంతిభద్రతలను నెలకొల్పేరీతిలో తన సిబ్బందితో కలిసి గురువారం రాత్రి ఆ ప్రాంతానికి వెళ్లారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ ఈర్షాద్వేషాలతో రగలిపోతూ ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుంటే ప్రశాంతత ఉండదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కొన్ని చట్టాలను అమలు చేస్తుందన్నారు. శాంతిని నెలకొల్పడంలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కోరుకొండలో ఆలయాల అభివృద్ధికి కృషి



కంబాల శ్రీనివాస్

మధురపూడి: ప్రజల్లో భక్తి భావాన్ని విస్తృతం చేసే లక్ష్యంతో కోరుకొండలోని ఆలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోరుకొండలో ఆలయాలు అధిక సంఖ్యలో ఉండటంతో ఆధ్యాత్మిక భావం వృద్ధి చెందుతోందన్నారు. స్థానిక శ్రీవల్లీ సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేక విరాళాన్ని అందిస్తానన్నారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సుమారు రూ.10 లక్షల అంచనాతో శాశ్వత షెడ్డు నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే మండలంలోని శ్రీరంగపట్నం గ్రామానికి రూ.5 లక్షలు విరాళంగా ఇచ్చామన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు

మధురపూడి: కోరుకొండలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా గురువారం పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఎస్సై శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఈ మేరకు నడుం బిగించారు. దీనిలో భాగంగా రోడ్డును ఆనుకుని బండ్లపై వ్యాపారాలు చేస్తున్న వారికి పంపించివేశారు. అలాగే ఇరువైపులా ఆయిల్ ట్యాంకర్లు, గ్యాస్ సిలిండర్లను తరలించే భారీ వాహనాలను రోడ్డు పక్కన నిలుపవద్దంటూ హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ట్రాఫిక్ క్లియరెన్స్ చేశారమని వారు తెలిపారు.

పోస్టల్ బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ తప్పనిసరి

రాజమహేంద్రవరం సిటీ: పోస్టల్ బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ తప్పనిసరిగా చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ సామాజిక ప్రయోజనాలను పొందడానికి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కోసం ఇది అవసరమన్నారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానాన్ని పోస్టల్ బ్యాంక్ ద్వారా అమలు చేయడానికి, కొత్త బ్యాంక్ ఖాతాలను తెరవడానికి, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కోసం, పోస్టల్ బ్యాంక్ ఖాతాలకు ఆధారును లింక్ చేయడానికి ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. పోస్టాఫీసులో ఖాతా ఉన్నవారు తప్పనిసరిగా ఆధార్ లింక్ చేసుకోవాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో 7 నుంచి 15 వరకూ పోస్టాఫీసు ఖాతాలు తెరవడానికి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

- ప్రభుత్వాసుపత్రుల్లో సరిపడా నిల్వలు
- ప్రతి శని, బుధవారాల్లో ఉచితంగా టీకాలు



పందలపాకలో చిన్నారులకు టీకా వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

బిక్కవోలు: వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గర్భిణుల నుంచి అప్పుడే పుట్టిన చిన్నారుల వరకూ ప్రభుత్వం సూచించిన సమయాల్లో టీకాలు వేయిస్తే వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యకరమైన జీవితం గడపొచ్చు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సరైన అవగాహన లేక టీకాలు వేయించుకోవడం లేదు. దీని వల్ల వివిధ రకాల వ్యాధులకు గురవుతూ ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధినిరోధక టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ప్రతి శని, బుధవారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, జి.మామిడాడ సీహెచ్‌సీలు, కొంకుదురు, బిక్కవోలు, రామవరం, కుతుకులూరు, పెద్దాడ, పెదపూడి, రంగంపేట పీహెచ్‌సీలతో పాటు 79 వైఎస్సార్ క్లినిక్‌ల్లో టీకాలు వేస్తున్నారు.

వ్యాక్సిన్‌లు వేసేది ఇలా

- గర్భిణిగా నిర్ధారణ అయిన మూడు నెలలు నిండిన తర్వాత ఒక టీటీ ఇంజెక్షన్, అనంతరం ఇంకో నెల రోజుల వ్యవధిలోనే మరో టీటీ ఇంజెక్షన్ వేయాలి. వీటితో పాటు ఐరన్ ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు ఇస్తారు. ప్రసవం అనంతరం ఐరన్ టాబ్లెట్స్ ఇస్తారు.
- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్–బీ డోసు వేయాలి. వీటి వల్ల పోలియో, పచ్చ కామెర్ల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి. 6, 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి.
- 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటా వాలెంట్ వేయించాలి. వీటివల్ల కోరింత దగ్గు, కంఠ సర్పి, ధనుర్వాతం, మెదడువాపు, పచ్చకామెర్లు వంటి వ్యాధుల నుంచి చిన్నారిని కాపాడుకోవచ్చు.

టీకాలు తప్పనిసరి



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలి. వీటివల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవొచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజలకు టీకాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ విజయలక్ష్మి, వైద్యురాలు, కొంకుదురు పీహెచ్‌సీ

- తొమ్మిది నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్–ఏ చుక్కలు వేయించాలి. తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వయసు వరకూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి విటమిన్–ఏ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు ఇప్పించాలి.
- 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోసు డీపీటీ, మీజిల్స్, విటమిన్–ఏ ఓపీని వేయించాలి.
- ఐదేళ్లు పూర్తయిన తర్వాత డీపీటీ డోసు వేయించాలి. 10, 16 సంవత్సరాలు పూర్తయితే టిట్నాస్(టీటీ) చేయించాలి.

బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ప్రారంభం



శిబిరం ప్రారంభించిన హెచ్‌ఎం వీర ప్రభాకరరావు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద పాఠశాల క్రీడల సమాఖ్య అండర్ –17 బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టు శిక్షణ శిబిరాన్ని పాఠశాల హెచ్‌ఎం పళ్లా వీర ప్రభాకరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9 తేదీన రాజమహేంద్రవరంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. దీంట్లో తూర్పు గోదావరి జిల్లా జట్టుకు శిక్షణ ఇవ్వడానికి బిక్కవోలు ఉన్నత పాఠశాల వేదికగా మారడం చాలా ఆనందదాయకమన్నారు. క్రీడాకారులు మెరుగైన ఫలితాలు సాధించడానికి ఈ శిక్షణ శిబిరం ఎంతో దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో అనపర్తి జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పడాల శ్రీనివాసరెడ్డి, తొండాపు రాఘవరెడ్డి, పీడీ మానకొండ ధనరాజ్ పాల్గొన్నారు.

సాయిబాబాకు క్షీరాభిషేకం



బూరుగుపూడిలో బాబాను దర్శించుకుంటున్న భక్తులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి బాబా ఆలయంలో గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. బాబావారిని 108 లీటర్లతో పాలతో అభిషేకించారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ గురువు మామిడిపల్లి రామారావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా రాజమహేంద్రవరానికి చెందిన సుంకవల్లి సత్యనారాయణ, శ్రీదేవి దంపతులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం మధ్యాహ్నం గండుబోయిన వెంకట సుబ్బారావు దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు భారీ అన్నసమారాధన జరిగింది. అలాగే మండలంలోని పలు బాబా ఆలయాల్లో పూజలు జరిగాయి.

కార్తిక వన భోజన కార్యక్రమం



అనపర్తిలో అమ్మవారిని దర్శించుకుంటున్న డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

పెదపూడి: అనపర్తిలో వీరుళ్లమ్మ అమ్మవారి ఓం శక్తి సత్సంగ సభ్యుల త్రిశక్తి పీఠం సభ్యులు కార్తిక వన భోజన కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు హాజరయ్యారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఏటా కార్తిక వన సమారాధన ఘనంగా నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సత్సంగ ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

సీతానగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రవేశపెట్టిన పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) ఎస్.మాధవరావు అన్నారు. సీతానగరం, కోరుకొండ, రాజమహేంద్రవరం, అనపర్తి సబ్ డివిజన్ వీఏఏ, వీహెచ్ఏలకు గురువారం ఇనుగంటివారిపేటలోని ద్వారకామాయి ఫంక్షన్ హాల్లో శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన డీఏవో మాధవరావు మాట్లాడుతూ పొలం పిలుస్తోంది, పంట నమోదు, పొలంబడి, పీఎం కిసాన్ తదితర పథకాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త చల్లా నర్సింహరావు మాట్లాడుతూ సార్వా, దాళ్వా నూతన వంగడాల గురించి వివరించారు. రాజమహేంద్రవరం వ్యవసాయాధికారి భీమరాజు మాట్లాడుతూ పొలంబడిలో అనుసరించాల్సిన వ్యవసాయ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో కోరుకొండ ఏడీఏ బి.మల్లికార్జునరావు, డీఆర్‌సీ ఏడీఏ జయరామలక్ష్మి, రాజమహేంద్రవరం ఏడీఏ డి.శ్రీనివాస్‌రెడ్డి, ఏవోలు పాల్గొన్నారు.



ఇనుగంటివారిపేటలో మాట్లాడుతున్న డీఏవో మాధవరావు

పోషకాహార భద్రతపై..

ఇనుగంటివారిపేట ద్వారకామాయి ఫంక్షన్ హాల్లో డీఏవో మాధవరావు ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు పోషకాహార భద్రతా పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా టుబాకో బోర్డు రీజినల్ మేనేజర్ ప్రసాద్ హాజరయ్యారు. డీఏవో మాధవరావు మాట్లాడుతూ వర్జీనియా పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, మినుము, పెసర తదితర ఆరుతడి పంటలపై రైతులు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో వర్జీనియా పొగాకు రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు జక్కంపూడి రాజా పరామర్శ

మధురపూడి: నియోజకవర్గంలోని పలు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా గురువారం పరామర్శించారు. కోరుకొండకు చెందిన గరగ వెంకటరమణ, ముమ్మిడివరపు సునీల్ ఇటీవల మరణించారు. వారి కుటుంబాలను రాజా పరామర్శించారు. జంబూపట్నంలో ఉల్లి ప్రకాశం, తోరాటి కృష్ణవేణి, కాపవరంలోని బరుత్తు వీర్రాజు, రాజానగరం మండలం రాధేయపాలేనికి చెందిన మారిశెట్టి వీర్రాజు కుటుంబాలను ఓదార్చారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి, శస్త్రచికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న గాడాలకు చెందిన చల్లా నందకిషోర్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంటన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



గాడాలలో నందకిషోర్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

జీజీయూలో ఉత్సాహంగా వర్క్‌షాప్‌లు

రాజానగరం: గోదావరి గ్లోబెల్ యూనివర్సిటీ (జీజీయూ)లో గురువారం మూడు వర్క్‌షాప్‌లు జరిగాయి. ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో హెచ్‌ఓడీ డాక్టర్ పి.వెంకట్రావు అధ్యక్షతన 'ఇండస్ట్రియల్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' (ఐఐఓటీ)పై మొదటి వర్క్‌షాప్ జరిగింది. దీనిలో బెంగళూరులోని అడ్వాన్స్ మెకానికల్ సర్వీసెస్ సంస్థ సీనియర్ మేనేజర్ బీఎస్ మహబూబూబ్ బాషా మాట్లాడుతూ వ్యాపారాలు, పరిశ్రమలు మరింత సమర్థంగా పనిచేయడానికి ఐఐఓటీ తోడ్పడుతుందన్నారు. ఇది పరికరాల మధ్య కమ్యూనికేషన్ సులభతరం చేసే సాంకేతికతను సూచిస్తుందన్నారు. అలాగే కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీజ మధు అధ్యక్షతన 'స్టార్టప్ అపార్చునిటీస్' అనే అంశంపై రెండో వర్క్‌షాప్ జరిగింది. క్రేంబ్రిడ్జి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కార్పొరేట్ రిలేషన్స్ హెడ్ డాక్టర్ వై.మురళీధరరెడ్డి మాట్లాడుతూ స్టార్టప్‌లు ఏవిధంగా ప్రారంభించాలో అవగాహన కలిగించారు. 'అన్‌రియల్ ఇంజిన్'పై మూడో వర్క్‌షాప్ జరిగింది. ఈ ప్రీమియర్ గేమ్ డవలప్‌మెంట్ ప్లాట్‌ఫాం ఆధారంగా త్రీడీ గేమింగ్ ప్రపంచాలను రూపొందించేందుకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించడమే లక్ష్యంగా ఈ వర్క్‌షాప్‌ని నిర్వహించారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డాక్టర్ మురళీధరరెడ్డి

క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన ర్యాలీ



సంపరలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యురాలు శిరీష తదితరులు



కొంకుదురులో ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెదపూడి: మండలంలోని సంపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యురాలు ఎస్‌వీ శిరీష మాట్లాడుతూ వైద్య సిబ్బంది పీహెచ్‌సీ పరిధిలో ఇంటింటికీ వెళ్లి 18 ఏళ్లు పైబడిన వారందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ చేయనున్నట్లు తెలిపారు. మహిళలకు రొమ్ము, గర్భాశయ, ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తారన్నారు. తొలిదశలో సీహెచ్‌సీ ఏఎన్‌ఎంలు, ఆశాలు ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్ గురించి మహిళలకు వివరించి లక్షణాలు ఉంటే తెలియజేయాలని కోరతారన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌వీ ప్రసాద్, వైద్య సిబ్బంది విజయలక్ష్మి, జోగిరాజు, వీరగనిక, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిల్లంకలో నిర్వహిస్తున్న ర్యాలీ

కొంకుదురులో...

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యురాలు జి.విజయలక్ష్మి మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన వారందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్షించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రజలంతా తమ వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. బిక్కవోలు పీహెచ్‌సీ వద్ద వైద్యురాలు దుర్గాదేవి తమ సిబ్బందితో కలిసి క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలోని ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

సీతానగరం: వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై మండలంలో గురువారం ర్యాలీలు నిర్వహించారు. సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య, డాక్టర్ రాజు, డాక్టర్ ఏసురాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం వల్ల ప్రాణాంతక క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చన్నారు.

న్యూట్రీ, కిచెన్ గార్డెన్లకు స్థలాల సేకరణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

సీతానగరం: రైతు సాధికార సంస్థ మండల రీసోర్స్ పర్సన్ ఎస్.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బొబ్బిల్లంక అంగన్‌వాడీ కేంద్రం –2లో గురువారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పౌష్టికాహారం అందించడానికి న్యూట్రీ, కిచెన్ గార్డెన్లకు ఆయా గ్రామాల్లో స్థలాలు సేకరించాలని సూచించారు. వాటిలో ఆకుకూరలు, తీగజాతి పాదులు, కూరగాయలు, పలు రకాల పండ్ల మొక్కలు నాటాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు గ్రామాల్లోని ఇంటర్నేషనల్ కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్ (ఐసీఆర్‌పీ) సిబ్బంది అందుబాటులో ఉంటూ, న్యూట్రీ, కిచెన్ గార్డెన్ల ఏర్పాటుకు సహకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ మండల రీసోర్స్ పర్సన్ ఎస్ శ్రీనివాస్, ఎంటీ వరలక్ష్మి పాల్గొన్నారు.

రాజానగరం మండల అధికారుల ఫోన్ నంబర్లు

ఎంపీడీఓ	ఎస్‌జే ఝాన్సీ	96520 77166
తహసీల్దార్	ఎస్.లక్ష్మీలావణ్య	98499 03900
డిప్యూటీ తహసీల్దార్	ఎ.కుమారి	99491 00395
మండల సర్వేయర్	ఇ.అనిత	81794 14568
మండల సివిల్ సప్లయిస్ డీటీ	గొలుగూరి బాపిరాజు	91823 02929
మండల రీసర్వే డీటీ	బి.క్రాంతి	7382 286190
మండల వ్యవసాయాధికారి	ఎస్‌కే ఇమామి ఖాసిం	83310 56550
మండల ఇంజినీర్	సంపత్ కుమార్	98661 35609
విద్యుత్ శాఖ ఇంజినీర్, రాజానగరం	సుధాకర్	94408 12623
విద్యుత్ శాఖ ఇంజినీర్, సంపత్ నగరం	సత్యప్రసాద్	94408 12627
మండల విద్యాశాఖాధికారి– 1	రామన్నదొర	94409 13928
మండల విద్యాశాఖాధికారి– 2	జ్యోతిప్రసాద్	94401 71896
ఐసీడీఎస్ ప్రాజెక్టు, సీడీపీఓ	టి.నాగమణి	94408 14693
ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) ఏపీఎం	సునీత	79933 25065
గృహ నిర్మాణ శాఖ డీఈ	ఆర్‌వీ బాబు	70939 30566
గృహనిర్మాణ శాఖ ఏఈ	ఏవి రామారావు	70939 30478
సబ్ రిజిస్ట్రార్, రాజానగరం	వెంకటేశ్వరరావు	70939 21434
పోలీసు శాఖ		
రాజానగరం సీఐ	ఎస్‌పీ వీరయ్య గౌడ్	94407 96585
రాజానగరం ఎస్సై– 1	మనోహర్	94932 06031
ఎస్సై– 2	నాగేశ్వర్	94904 91132
బొమ్మూరు సీఐ	కాశీ విశ్వనాథ్	94407 96533

● ఆకట్టుకున్న తోలు బొమ్మలాట

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సాంస్కృతిక సమితి, విజయవాడలోని సెంటర్ ఫర్ ఏపీ స్టడీస్ (కాప్స్) సంయుక్త నిర్వహణలో 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం' సదస్సును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన తోలు బొమ్మలాట విద్యార్థులను అమితంగా ఆకట్టుకుంది. పూర్వం వినోదానికి, విజ్ఞానానికి వారధిగా నిలిచిన తోలు బొమ్మలాటను చూసి విద్యార్థులు సంభ్రమాశ్చర్యాలు వ్యక్తం చేశారు. పలువురు విద్యార్థులు ఈ ప్రదర్శనను తమ సెల్‌ఫోన్లలో బంధించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. కార్యక్రమంలో తోలు బొమ్మలాటతో పాటు బుర్రకథ, హరికథలను కూడా ప్రదర్శించారు.



'నన్నయ'లో ప్రదర్శించిన తోలు బొమ్మలాట